# మల్లెలమాసం

## సింగరాజు రామచంద్రమూర్తి

''అయితే నీ నిర్ణయం మారదంటావు బేబీ ?''
అడిగాడు కృష్ణమోహన్.

''మారదు డాడీ''. అంది నిశ్చయంగా బేబి.

''ఆలోచించావా ? ఐ మీన్ బాగా ఆలోచించావా అని.''

నవ్వింది బేబి. ''చాలా బాగా ఆలోచించాను డాడీ. నాకయితే నేను చేస్తున్న పని కరెక్ట్ అనిపిస్తోంది.'' అంది.

ఆయన కాసేపు మాట్లాడకుండా కూతురి వంక చూస్తుండిపోయారు. తరువాత లేచి నిలబడి ''నేనెవరిని ?'' అనడిగారు.

నవ్వి ''డాడీ– మై ఫాదర్'' అంది బేబి.

''నో. నా ఉద్యోగం ఏమిటి ? అని.''

''ప్రొఫెసర్ కృష్ణమోహన్, కన్సల్టింగ్ ఇంజనీర్, ఫారిన్ రిటర్న్డ్ ! ఈ ప్రాంతంలో లెక్కల్లో మీకు ఎదురుచెప్పే వారేలేరు.'' అని నవ్వి, ''చిన్నప్పటినుంచీ ''మీ నాన్నగారు ఏం చేస్తుంటారు ?'' అని ఎవరు అడుగుతారా అనుకుంటుండే దానిని డాడీ, ఐయామ్ ప్రౌడాఫ్ మై ఫాదర్'' అంది.

''నేనూ డిటోనే బేబి — ఇదిగో ఈ నిర్ణయం తెలియక ముందు దాకా !''

''అది ఒక్కటీ క్షమించి ఆశీర్వదించలేరా డాడీ ?''

''నెవర్. కన్నకూతురు తప్పు చేస్తుంటే ఏ ఫాదరూ సహించలేడు బేబీ ! దట్సాల్, నాకున్న అపారమయిన అనుభవం ఆస్తిపాస్తులతో ! మన కుటుంబం ఎటువంటిది ? మా నాన్నగారు జడ్జి. మీ అమ్మ నాన్నగారుపేరుమోసిన క్రిమినల్ లాయర్ నీకున్న ఒకే ఒక్క బ్రదర్ ఎమ్.టెక్– అమెరికాలో! మరి నువ్వు ?''

నవ్వేసింది బేబి ''పోనీండి డాడీ, మామూలు మనిషిగా మీ ఇంటికిరానిస్తుండండి. అంతేచాలు నాకు''

''ఛీ'' విపరీతమయిన కోపంతో చేతిలో ఉన్న పుస్తకాన్ని విస్సిరి కొట్టారాయన. ఆ దెబ్బకి బల్ల మీదనున్న పూలకుండీ కిందపడి తునాతునకలై పోయింది.

బేబి తెల్లబోయింది.

''వాటీజ్ దిస్'' అన్నారాయన ఫ్రిజ్ చూపిస్తూ.

''ఫ్రిజ్ డాడీ, నాకు ఐస్ క్రీం ఇష్టమని కొనిపెట్టారు మీరు'' అంది మెల్లగా.

''కరెక్ట్. ఇది నీతో రాదు. గుర్తుంచుకో. నెక్స్ట్– ఇదేమిటి ?''

''త్రీ ఇన్ వన్. నా గొంతు టేప్ చేసుకుని వినటం నాకు సరదా అని నా కోసం కొన్నారు మీరు డాడీ !''

''ఇదీ నీతో రాదు. ఎస్ మరి ఇదేమిటి ?''

మాట పూర్తవకుండానే వెక్కివెక్కి ఏడవ సాగింది బేబి. ''డోంట్ బి సో క్రూయల్ డాడీ, మీ కూతుర్నయిన పాపానికి అంత శిక్ష విధించకండి డాడీ– అయి వాంటిట్. అది నాకు కావాలి !''

''నువ్వు నన్ను ఎంతశిక్షిస్తున్నావో గుర్తుంచుకో బేబీ, నాకూతుర్నయిన పాపానికి'' అంటున్నావు. ఇప్పటి దాకా అదే మహాపుణ్యం అనుకున్న దానివి ఇప్పుడు పాపం అనిపించుతోంది నీకు.

నో. ఐ వాంటిట్ ! అయికెన్ నెవర్ పార్ట్ విత్ ఇట్. చెబుతున్నాను విను. ఏడుస్తూ విను. అది టెలివిజన్. దానిమీద మీ అమ్మ వీడియో వేసుకుని చూడటం నీకు అలవాటు.

మీ అమ్మ పోవడం నా దురదృష్టం. అయితే పోయేముందు ఆ వీడియో ఏర్పడటం నా అదృష్టం ఆమె బ్రతికే ఉన్న భావన కలుగుతోంది. ఆమె దిన చర్య యావత్తూ రికార్డ్ చేయించావు – నువ్వే ! అందుకు నీకెప్పుడూ ఋణపడి ఉంటాను. కాని నీకివ్వనది. దట్సాల్ ''

బేబి మాట్లాడకుండా ఏడుస్తూనే ఉంది.

''నా మాట వినని నీకు ఇవ్వను. అది నా భార్యది... పోనీ ఇప్పటికయినా నీ మనసు మార్చుకుంటావా ? దట్ యంగ్ ఇడియట్ నీ సుధీర్‌ని మరిచిపోతావా ?''

''నో డాడీ, అతన్ని మరిచిపోను. అతన్నే చేసుకుంటాను.''

కాసేపు ఆయన ఏమీ మాట్లాడలేదు. తరువాత ఆమె వంకనే చూస్తూ ''మీ ఇద్దరి పరిచయం ఎన్నాళ్లదీ ?'' అనడిగారు.

''నాలుగు, అయిదేళ్ళ మధ్య'' అంది మెల్లగా బేబి.

''ఈ కాలంలోనే అంతగా ఒకరంటే ఒకరు పూర్తిగా అర్థం అయ్యేంత పరిచయం వచ్చేసిందా ?''

''వచ్చింది డాడీ.''

''నిన్ను మనస్ఫూర్తిగా ప్రేమిస్తున్నాడంటావు ?''

''అవును డాడీ. నేనూ అంతే !''

''నీ సంగతి వదిలేయ్. నాకు కావలసింది ఆతను నువ్వంటే పంచ ప్రాణాలు, నీ మీద పూర్తి నమ్మకం కలవాడంటావు. అందులో నీకెటువంటి సందేహం లేదంటావు ?''

నవ్వి ''సందేహం లేదు డాడీ !''

మాట్లాడకుండా కాసేపు ఫానువంక చూసి తరువాత ''సో నువ్వు మారనప్పుడు నాకు మార్గాంతరం లేదు కదా– నేను మారాలంటావు'' అన్నారు.

''డాడీ, దేముడులాంటి వారు మా డాడీ, స్వీట్ డాడీ'' ఆనందంతో అంటున్న బేబికి అడ్డం వచ్చారు కృష్ణమోహన్.

''నా ఆస్తి ఎంతుందంటావు ?''

''కష్టండాడీ చెప్పడం. అయినా వారు వీరు చెప్పుకునే మాట నలభయి ఉంటుందని.''

''మరో పది కలిపి మేకిట్ ఫిఫ్టీ ! ఏమిటవి లక్షలు. ఆల్‌రైట్. ఒక గుమాస్తా ఉద్యోగానికి సెలక్షన్ కోసం ఏం చేస్తారు ?''

''అంటే నాకర్థం కావటంలేదు'' అంది బేబి అయోమయంగా.

''అంటే ఒక అబ్బాయిని బాంకులో గుమాస్తా ఉద్యోగం ఇచ్చేందుకు ఏఏ పరీక్షలు పెడతారు అని''

''నను వెళ్ళలేదు కదా ఎప్పుడూ. ఫ్రెండ్సు చెబుతుంటారు. ఒక వ్రాత పరీక్ష తరువాత ఒక ఇంటర్వ్యూ ఉంటాయట !''

''గుడ్ జీతం ఎంతుంటుంది–సే ఆరువందలు అనుకో. ఆరువందలు నెలకి అంటేసంవత్సరానికి ఏడు వేల రెండువందలు. పైన బోనసు వగయిరాలతో పది వేలేసుకో ! పదివేల ఆదాయానికి రెండు పరీక్షలు అదీ ఫలితం కోసం సుమారు నాలుగు నెలలు ఆగాలి!

నా ఆస్తిలో నీ వాటా ఎంత ? పది లక్షలు వేసుకో. దీనికి ఆతనే యజమాని అవుతాడు కదా ! మరి ఇందుకోసంఎంత సేపుపరీక్షించాలి ఆ అబ్బాయిని?

''వండర్‌ఫుల్ డాడీ, అదా మీ ఆలోచన ! మీ ఇష్టం వచ్చిన పరీక్ష పెట్టుకోండి. చదువులోనా, ఆటల్లోనా ?''

''నో, చదువు– ఉట్టి గ్రాడ్యుయేట్ కదా ! నాకనవసరం. అదికాదు. నీపట్ల అతని మనసు ఎటువంటిది ? అంత వరకే నా కుతూహలం ! ఆల్‌రైట్ ఆర్నెలలు. ఆరునెలల పాటు నువ్వు నేను చెప్పినట్లు చేస్తానని ఒప్పుకుంటే ప్రాసీడవుతాను ఈ సమస్యలోకి''

''ష్యూర్ డాడీ, మీరు అంగీకరిస్తానంటే దేనికయినా ఒప్పుకుంటాను. ఏం చేయమన్నా చేస్తాను.''

''ఏమీ చేయనక్కరలేదు. ఆరునెలలు అతన్ని చూడకూడదు. అతనితో మాట్లాడకూడదు. ఎటువంటి ఉత్తరప్రత్యుత్తరాలు, రాక పోకలు ఉండ కూడదు. సరా ?''

''ఎస్ డాడీ, మీ ఇష్టం.''

''నేనేమి చేస్తున్నా అదేమిటని ప్రశ్నించకూడదు చూస్తూ ఊరుకోవడం మినహా.''


"సరే, ఆర్నెల్లు అయినాక ఏం జరుగుతుంది?" అడిగింది కుతూహలంగా బేబి.

కాసేపు ఆమె వంకనే చూసి "ఆరునెలలు అయినాక నువ్వే అతన్ని వద్దంటావు" అన్నారాయన.

"వ్యాట్ ? నెవర్ !"

"అరవకు. మీ ఇద్దరి ప్రేమలో మార్పు లేక పోతే నేనే స్వయంగా పెళ్ళి చేస్తానని చెబితిని కదా ! నా మాట తప్పను."

"అయితే నా మాటా వినండి డాడీ, ఆరునెలలు కాదు ఆరుసంవత్సరాలు గడచినా మేం ఒకరి కోసం ఒకరం వేచి ఉండి మీ ప్రయత్నాలని భంగపరచి తీరతాం. ఒకరంటే ఒకరికి నమ్మకమూ ఉంది."



"అతనిని వదలవలసి వస్తే నువ్వు మాత్రం మొండి పట్టుదలలకి పోకూడదు."

"అలాగే !"

"ఈ రోజునుంచే నీకీ ఇల్లు జైలు— ఎప్పు డయినా నేను తీసుకెడితే గాని, నేను నియమించిన వారు తీసుకు వెడితేగాని బయటకి వెళ్ళాలి. ఫోను ముట్టుకోకూడదు. నాతో పూర్తిగా సహకరించాలి."

"అలాగే డాడీ."

కూతురువంక చూసి ఆయన నవ్వారు. బేబీ కూడా శృతి కలిపింది.

కొన్నాళ్ళుపోయాక ఒక కుర్రాడిని వెంటబెట్టు కునివచ్చారు కృష్ణమోహన్. "ఇతను నా ప్రయివేటు సెక్రటరీ. పేరు పవన్ కుమార్ ఎమ్మెస్సి ఫస్ట్‌క్లాస్. ఈ ఇంట్లోనే ఉంటాడు. అతను ఎక్కడయినా తిరగచ్చు ఇంట్లో" అన్నారు.

అతను ఏమీ మాట్లాడకుండా నిలబడ్డాడు. పొడుగ్గా ఆరోగ్యంగా బాగున్నాడు. బేబి మాత్రం ఒక్కసారి అతని వంక చూసి తలతిప్పేసుకుంది.

"నీకు తోచకపోతే ఇతనితో కారమ్స్, చెస్ లాంటివి ఆడొచ్చు. నమ్మకస్తుడు, తన హద్దులు తను తెలిసినవాడు..." అని కాసేపాగి "మాఅమ్మాయి. నాకు ఒక అబ్బాయి కూడా ఉన్నాడు— అమెరికాలో ! ఈమె పేరు నాకు బేబి, నీకయితే పల్లవి ! కొన్నాళ్ల

పాటు విశ్రాంతి తీసుకోమన్నాను అందుకు ఎక్కడికీ వదలదు బయటకి వెడితే నాతో వెళ్ళాలి అంతే!''

మరో రెండు రోజులకి గది అంతా మిరుమిట్లు గొలిపే లైట్లు ఏర్పాటు చేయించారు కృష్ణమోహన్

''ఇవన్నీ ఎందుకు డాడీ, సినిమా స్టూడియో లాగ'' అంది పల్లవి

''స్టూడియోనే అనుకోమ్మా నీకన్నా అందమయిన వాళ్ళా ఆ సినిమాలలో వేసేవాళ్ళు మిస్టర్ పవన్ యామైరైట్?''

అతను నవ్వి ఊరుకున్నాడు

తరువాత ఒకరోజు ఒక జంట వచ్చారు ఆడ, మగా!

''వీళ్ళు ఇంటీరియర్ డెకొరేటర్స్ బేబి, అంటే ఇళ్ళ లోపలి భాగాలు అందంగా అలంకరిస్తారన్న మాట దానితోపాటు మనకి కూడా వాటికి మాచ్ అయ్యే బట్టలు సజెస్ట్ చేస్తారు'' అన్నారు కృష్ణమోహన్

పవన్ దగ్గరుండి వాళ్ళు చెప్పేవన్నీ జాగ్రత్తగా వింటూ నోట్ చేసుకుంటున్నాడు

''మీ చర్యలన్నీ వింతగా ఉన్నాయి డాడీ'' అంది వాళ్ళనీ, వాళ్ళతోపాటు తిరుగుతున్న పవన్‌ని చూస్తూ

''మన అగ్రిమెంటు మరిచిపోతున్నావు బేబి బైదిబై, ఆ ఆడమ్మాయి వచ్చిందే ఆవిడ బ్యూటీ పార్లర్ ఒకటి నడుపుతోంది నీకు ఎప్పుడూ అలవాటులేదుగదా! అందుకు తననీ పిలిచానన్న మాట నీకు అందంగా, ఇంకా అందంగా కనబడేందుకు సూచనలిస్తుంది, స్వయంగా అలంకరించి చూపుతుంది కూడా!''

నవ్వుతూ ''అగ్రిమెంటు కద — సరే'' అంది బేబి

ఒక్క వారంలో ఆ ఇల్లు, ముఖ్యంగా ఆమె వాడుకునే మేడ పైభాగం పూర్తిగా మారిపోయింది అత్యాధునికమయిన అడ్వర్టయిజుమెంట్లలోని పడక గదుల్లాగా తయారయింది ''వండర్‌ఫుల్ డాడీ, చాలా బాగా చేయించారు'' అంది బేబి ముగ్ధురాలై పోయి

''ఇంకా చూస్తూండు బేబి, రేపు నీకు స్పెషల్ డ్రెసెస్ డెలివర్ చేశాక ఇంకా ఆశ్చర్యపోతావు—మీ డాడీ చేస్తు ఏమిటో అర్థమౌతుంది''

ఆయన మాట అక్షరాలా నిజమనిపించిందా అమ్మాయికి తనెప్పుడూ అంత అందంగా బట్టలు ఎన్నుకోలేదు అంత అందంగా మేకప్ కామూ లేదు

డ్రెస్సింగ్ టేబుల్ ముందు నిలబడి తనని తను చూసుకుంటోంది — మేకప్ ఎంత మార్పు తెస్తుంది — అనుకుంటూ కొత్తగా అమర్చిన దీపాలు ఆ గదిని పట్టపగలు చేస్తున్నాయి

ఇంతలో ఎక్కడినుంచో పరుగెత్తుకుంటూ పవన్ రావడం, ఆమెను గభాలున ఎత్తేసుకోవడం క్షణాలలో జరిగిపోయింది. ''ఎందుకు, ఏమిటి?'' అని అడిగేంతలో భళ్ళున ఏదో పడగా గాజు పగిలిన శబ్దం కావడంతో భయపడిపోయి అతని మెడని గిట్టిగా చుట్టేసింది పల్లవి! గుమ్మంలో

## మల్లెల మాసం

కృష్ణమోహన్ దగ్గర ఆమెని దింపి పక్కన నిలబడ్డాడు పవన్

''చూశావా ఆరక్షణంలో పవన్ లేకపోతే ఆ పైని దీపాలగుత్తి నీ నెత్తిన పడుండేది ఎలా పసికట్టావోయ్— చాలా థాంక్స్! యుహావ్ సేవ్‌డు మై బేబి'' అన్నారు కృష్ణమోహన్

వెనక్కి తిరిగిచూసింది బేబి తను నించున్న చోట గాజు పెంకులు చెల్లా చెదురుగా పడిఉన్నాయి

''సోమెనీ థాంక్స్, రక్షించారు ఎలా తెలుసుకున్నారు, అది పడబోతోందని?'' అంది కళ్ళలో కృతజ్ఞత నింపుకుని పల్లవి

''జస్ట్ సిక్త్ సెన్స్ మిమ్మల్ని చూస్తున్నాము నేను, మీ డాడి నిలబడి! అంతలో ఎందుకో భయం వేసి మిమ్మల్ని ఎత్తుకొచ్చేశాను'' అన్నాడు పవన్ నవ్వుతూ

ఒకనాడు ''నిన్ను బయటకి పోనివ్వడం లేదు కనుక నీకు కాలక్షేపం అయ్యే ఏర్పాట్లు నేనే చేయాలి కదమ్మా! కమాన్'' అంటూ ఆమెని హాల్లోకి తీసుకువెళ్ళారు కృష్ణమోహన్ అక్కడ టేబుల్ టెన్నిస్, టేబుల్ ఉంది

### భేదం

రెక్కలపై బ్రతికే పక్షికీ, మనిషికీ
భేదమొక్కటే!
పక్షి ఆకాశంలో తిరుగుతూ,
భూమిపై జీవిస్తే,
మనిషి 'ఆకాశం'లో జీవిస్తూ
భూమిపై తిరుగాడుతాడు

— గన్ను కృష్ణమూర్తి

''మన పవన్‌తో ఆడాలి అతడు మంచి ప్లేయరట మరి మా బేబీ కూడా చాలా బాగా ఆడుతుందోయ్ పవన్ తేలికగా ఓడించవచ్చునన్న మూడ్‌లో ఆడబోకు యు నీడ్ ఆల్ యువర్ స్కిల్'' అన్నారు

మొదట ఏదో డ్యూటీగా మొదలెట్టింది ఆట బేబి అయితే రాను రాను అతని శ్రద్ధ చూసి మారిపోయింది, పూర్తిగా లీనమయిపోయింది గంట గడిచాక ''మీరిద్దరేమోగాని చూసి చూసి నేను అలసిపోయాను ఇప్పుడు డ్రింక్స్ తీసుకుందాం, పద బేబి నీ రూంలో కూర్చుందాం'' అన్నారు కృష్ణమోహన్

గదిలోకి రాగానే మంచం మీదికి వాలిపోతూ ''గ్రాండ్ డాడీ, పవన్ చాలా బాగా ఆడతారు రియల్లీ మిస్టర్ పవన్'' అంటుండగానే ''బేబీ, కదలకు. పవన్, చూశావా తేలు'' అని అరిచారు కృష్ణమోహన్.

బేబి బిగుసుకు పోయింది ఆమె తేలునెప్పుడూ ముఖాముఖి చూడలేదు ఆమె స్నేహితురాలి తమ్ముడొకడు తేలుకుట్టి చనిపోవటం మాత్రం ఎరుగుంది

రెండు అంగల్లో పవన్ వచ్చేశాడు ''అదుగో ఆ మూల ఉంది మీరు కదలకండి పల్లవీ'' అంటూనే విశాలమయిన ఆమె బెడ్ మీదికి ఎక్కేసి, పాకుతూ అటు వెళ్ళాడు ''మీ స్లిప్పర్ ఇవ్వండి'' అంటూ వెనక్కి తిరిగి భయంతో తనని అంటిపెట్టుకునిఉన్న బేబి వైపు చూసి నవ్వి ''అంత భయమా'' అన్నాడు

''అవును'' అన్నట్లు తల నిలువునా ఊపి అతనికి ఇంకా దగ్గరకు జరిగింది

పవన్ అప్పుడు సన్నపాటి దారం ఒకటి తీసి దాన్ని నేర్పుతో తేలుకొండికి ముడివేశాడు ఆ తేలు ముందుకి పాకడం, అతను దానిని వెనక్కి లాగాడు మళ్ళీ వెనక్కి తిరిగి ''చూశారా, అది ఇక మన చేతిలో బానిస! ఏం భయంలేదు నవ్వండి నేనుండగా మీకేం భయమండి?'' అన్నాడు

ఆమె పేలవంగా నవ్వి ''అదింకా చావలేదుగా'' అంది

''ఇలా తాడుతో కట్టేశాక ఇంకెక్కడికి పోతుంది? చూడండి సార్, మీ అమ్మాయి ముఖమంతా ఎలా చెమటలు పట్టేశాయో మైగాడ్!'' అంటూనే పక్కనే ఉన్న ఆమె కర్చీఫు ఆమె కందిచ్చి ''ఊఁ, ముఖం చక్కగా తుడుచుకోండి'' అన్నాడు

''ఆ తేలు అసలక్కడికెలా వచ్చింది పవన్?'' అడిగారు కృష్ణమోహన్ — పవన్ దానిని చంపి ఆవతల పారేశాక

''ఏముంది సార్, ఎండ కద బయట!'' అన్నాడు అతను

''నో, నా జీవితంలో మా ఇంట్లో తేలు రావడం ఇదే మొదటిసారి ఎండ ఏటా ఉండేదే కదా!'' అంది పల్లవి

''మనుష్యుల సంఖ్య పెరిగినట్లే వీటి సంఖ్య కూడా పెరిగిందేమో వాటికి పైగా కుటుంబ నియంత్రణ కూడా లేదు గదా!''

అందరూ నవ్వేశారు

ఒకరోజు పల్లవి బాత్‌రూంలో స్నానం చేసి చీర చుట్టుకొని బయటికి రాబోతోంది సరిగా అదే వేళకి రెండు పిల్లులు పోట్లాడుకుంటూ ఆమె దారికడ్డంగా పరుగెత్తాయి పిల్లులంటే ఆమెకి చాలా భయం అందులోనూ ఒకటి దారికడ్డంగా రావడంతో ఖంగారుపడి దానిమీద కాలువేసి కింద పడబోయింది పల్లవి హఠాత్తుగా పవన్ ముందుకు దూకి ఆమెని పట్టుకున్నాడు అయితే అప్పటికే ఆమెకి స్పృహ తప్పిపోయింది

ఎత్తుకు వెళ్ళి మంచంమీద పడుకోబెట్టి మెల్లిగా విసురుతూ ముఖం పట్టుకుని నిదానంగా అటు ఇటు ఊపసాగాడు

అతనితోపాటే వచ్చిన కృష్ణమోహన్‌గారు కంగారుపడిపోతూ ''మళ్ళీ మామూలు మనిషవుతుందంటావా పవన్ కుమార్?'' అన్నారు

''అవుతుంది సార్, మీ పని మీరు చేస్తే'' అన్నాడతను

కాసేపటికి ఆమె కళ్ళు తెరచి ''ఏమయింది?'' అనడిగింది.

''ఏమీ కాలేదు ఖంగారు పడకండి టేక్‌రెస్ట్. ఇలా తేళ్ళకి, పిల్లులకి భయపడిపోతే ఎలా మిస్ పల్లవీ— ఝాన్సీరాణి పుట్టిన దేశంలో పుట్టి!'' అన్నాడు నవ్వుతూ.

ఆమె కూడా బలహీనంగా నవ్వేసి "మీరు మాత్రం నన్ను కంటికి రెప్పలా కాపాడుతున్నారు. చిత్రం చూశారా ప్రతి అవాంతరంకి మీరు సమయానికి వస్తున్నారు" అంది.

"అది దైవికం— నా అదృష్టం అనుకోండి! మీకు సేవచేసేందుకు అందుబాటులో ఉండగలగటం అదృష్టం కదూ!" అని కాసేపాగి "యజమాని కూతురు కదా మీరు. దుప్పటి కప్పేశాను. కాసేపు హాయిగా పడుకోండి. స్లీప్" అని మంచం మీదనుంచి దిగాడు.

కొన్నిరోజులు పోయాక కృష్ణమోహన్ హటాత్తుగా వచ్చి "మనం ముగ్గురం మా పొలాలున్న ఊరు వెడుతున్నామివాళ! మా బేబి ఎప్పుడో చిన్నతనంలో వచ్చింది. అక్కడ అన్ని సౌకర్యాలు ఉంటాయిలెండి పవన్‌కుమార్, అచ్చం బస్తీలా ఉంటుంది. దేశం అభివృద్ధి చెందింది కదా" అన్నారు.

అక్కడ, ఆ పల్లెలోని ప్రకృతి సంపద చూసి ముగ్ధురాలైపోయింది పల్లవి. చక్కని పెద్ద కాలువ, ఆ కాలువకంటుకుని రెండు పక్కలా ఒంగి తమ ప్రతబింబాలు నీటిలో చూసుకుంటున్న కొబ్బరి చెట్లు, దానిని ఆనుకుని రోడ్డు...

"ఈ రోడ్డుమీద పరిగెత్తాలనిపించడం లేదు మీకు మిస్టర్ కుమార్" అంది పల్లవి.

"పరుగెట్టండి నిజంగానే పరుగెట్టండి— వెనకనుంచి ఎడ్లు గుంపుగా వస్తున్నాయి" అని అరిచాడు పవన్‌కుమార్.

వెనక్కి చూసింది పల్లవి.

రంకెలు వేసుకుంటూ వస్తున్నఎడ్లు. మువ్వలు గంటల గలగలలు— అంతే హడిలిపోయి "అమ్మో" అంటూ పవన్ వైపు ఒక్క అడుగువేసింది. ఆమెని పొదివి పట్టుకున్నాడు పవన్.

ఒక్క అయిదు నిముషాలలో వాళ్ళకి అటు ఇటు అన్ని ప్రక్కల ఎడ్లు పరుగెత్తాయి. ఎద్దులు, ఆవుల సముద్రం మధ్యన ఉన్నట్లుంది. తరువాత కాసేపటికి ఆ సందడి అంతా తగ్గింది. అవి రేపిన దుమ్ము అణిగింది.

ఇంకా తననే అంటిపెట్టుకుని ఉన్న పల్లవిని పవన్ నిదానంగా తట్టి "పల్లవిగారూ" అంటూ తన చుట్టూ ఉన్న ఆమె చేతులని మెల్లిగా సడలించాడు.

సిగ్గుపడి వెడంగా జరిగి "చాలా భయపడిపోయాను మిస్టర్ పవన్" అంది పల్లవి.

అంతలోనే అటువచ్చిన కృష్ణమోహన్‌గారితో "ఏం సార్ అన్ని మనవేనా?" అనడిగాడు పవన్.

అక్కడున్నన్ని రోజులూ సరదాగా గడిచిపోయింది కాలం. వచ్చేసే రోజు ముగ్గురూ గుడికి వెళ్ళారు. ఆ గుడికి కృష్ణమోహన్‌గారే ధర్మకర్త.

"పెళ్ళెప్పుడు బాబుగారు," అనడిగాడు పూజారిగారు పల్లవిని, పవన్‌ని చూసి.

నవ్వి కూతురు వంక చూశారాయన. ఆమె పవన్ వంక చూసింది. అతను మాత్రను ఏకాగ్రతతో ధ్యానంలో ఉండిపోయాడు.

బయటకు వచ్చేస్తుంటే అక్కడి పొదల్లో ఆమె పమిట చిక్కుకుపోయింది. వాటితో ఆమె పెనుగులాడుతుంటే పవన్ గభాలున వెనక్కి వచ్చి "ఈసారి సమయానికి కొంచెం ఆలస్యం అయ్యాను" అంటూ ఆమె పమిటని ఆ ముళ్ళనుంచి తప్పించాడు.

అతని వంక చూసి "థాంక్స్" అంది పల్లవి.

కృష్ణమోహన్‌గారు పెట్టిన ఆర్నెల్లలో ఇంక ఒక్కరోజు మాత్రం ఉందనగా పవనకుమార్ వచ్చాడు పల్లవి దగ్గరకు. కుర్చీ ఒకటి లాక్కుని ఆమెకి దగ్గరగా కూర్చుని "పల్లవిగారు. నేను మీ ఫాదర్ దగ్గర జీతానికి కుదిరిన ఉద్యోగిని. యజమాని చెప్పిన పని చేయడం భృత్యుడి కర్తవ్యం. కనుక నన్ను క్షమించండి" అంటూనే ఆమె చేతికి ఒక పెద్ద కవరిచ్చి "ఇవి ఫొటోలు, తీసి చూడండి" అన్నాడు.

తీయడమే తెల్లబోయింది పల్లవి. తను, పవన్ ఉన్న ఫొటోలవి. అన్నీను! ఎక్కువ వాటిల్లో తను అతని కౌగిట్లో ఉంది! "ఇదేమిటి?" అంది ఆమె.

"అవి ఇటివ్వండి. వరుసగా ఇస్తాను మీకు. ఇది నంబర్‌వన్. పైనుండి దీపాల గుత్తి పడి పగిలినప్పుడు."

చూసింది పల్లవి. అతని చేతుల్లో ఉంది. అతని మెడచుట్టూ తన చేతులు!

"ఇది నంబర్ టూ. మంచంమీద తేలు సీను. వెనక్కి తిరిగి "నవ్వండి. భయంలేదు నేనుండగా మీకేం భయం" అంటున్నాన్నేను. ఇది మూడు అదుగో పరువుమీద అక్కడ ఉన్నాం ఇద్దరమూను. మీకు చెమటలు పట్టేస్తే కర్చీపు ఇస్తూ "ఊ, ముఖం చక్కగా తుడుచుకోండి" అంటున్నాను. ఇంచుమించు నేను తుడుస్తున్నట్లే ఉంది కదూ?"

"ఉంది" అంది పల్లవి ఆ ఫొటో చూపి అతనికిస్తూ.

"నాలుగు. పిల్లల పోట్లాట. మిమ్మల్ని మంచంమీద పడుకోబెట్టి మీ ముఖం అటు ఇటు తిప్పుతున్నాను స్పృహ తెప్పించేందుకు. అయిదు అక్కడ పల్లెలో ఎడ్లు సీను. మిమ్మల్ని పొదివి పట్టుకున్న సన్నివేశం. అరవది — గుడి దగ్గర మీ పమిట ముళ్ళలో చిక్కుకుంటే తీశాను" అని నవ్వి "ఇవి ముఖ్యమయినవి. ఇవికాక ఇంకా మనం కారమ్స్ ఆడినవి, టేబుల్ టెన్నిస్ ఆడినవి చాలా ఉన్నాయి. ఫొటోగ్రాఫర్ మీ నాన్నగారు" అన్నాడు.

"ఈ ఫొటోల కోసం దీపాలు మార్పించారు ఇంట్లో! మొత్తం అలంకరించారు అవునా?" అంది పల్లవి.

పవన్ నవ్వి "అంతేకాదు. మీరు గమనించారో లేదో కాని మీకు కొత్తబట్టలు కొన్నారు — వాటితో మాచ్ అయేలా నాకూ కొన్నారు" అన్నాడు.

"ఏమిటి డాడీ ఇదంతా?"

"ఏముందమ్మా, నాకు చిన్నతనం నుంచి ఏ పరీక్షకు కట్టినా బాగా ప్రిపేరు కావడం అలవాటు. పందెం అయినా అంతే. నా శక్తినంతా వినియోగిస్తాను ... ముఖ్యమయిన విషయం ఈ ఫోటోలన్నీ మీ సుధీర్‌కి కాపీలు పంపాను. ఇక నా పనయిపోయింది. నీ ఇష్టం వచ్చినప్పుడు అతన్ని నువ్వు పిలిపించుకోవచ్చును. మన పందెం క్లైమాక్స్‌కి వచ్చింది ... పవన్ నువ్వు ఆఫీసుకి రా, నే వెడుతున్నాను" అని వెళ్ళిపోయారు ఆయన.

ఇద్దరూ మాట్లాడకుండా కూర్చున్నారు కాసేపు. చివరికి పల్లవి అంది — "మిస్టర్ పవన్, ఇప్పుడు ఇదంతా ఇంచుమించు బ్లాక్‌మెయిల్ కింద వస్తుంది. చదువుకున్నవారు మీరు ఇందుకు సహకరించారు మా ఫాదర్‌తో?" అని.

ఏం మాట్లాడలేదు పవన్.

"చెప్పండి. నేనేమీ అనుకోను."

"చచ్చిపోతాడన్న రోగికి కూడా బతుకుమీద ఆశ ఉంటుంది మిస్ పల్లవీ, నేనూ అంతే! ఆశ మనిషిని అలా చేయిస్తుంది."

"అంటే?"



ఇవి మీకోసం!

తెలుగు నవలను
కొత్త దారికి
మళ్ళించి పాఠకలోకాన్ని
ఎంటర్ టైన్ తో పాటు
ఎన్ లైటెన్ చేస్తున్న

యండమూరి వీరేంద్రనాథ్

ఆంధ్రజ్యోతి వారపత్రిక సీరియల్

అభిలాష
వెల.రు.20.00

వారివే మరికొన్ని నవలలు

| | |
|---|---|
| తులసీదళం 20-00 | ఆ ఒక్కటి అడక్కు 10-00 |
| తులసి ........20-00 | పర్ణశాల ..... 10-00 |
| యుగాంతం 10-00 | ఋషి ...... 10-00 |
| రాధా-కుంతి 10-00 | |
| నిశ్శబ్దం-నీకూనాకూమధ్య .......10-00 | |
| వెంగళప్పాహూదండ ............10-00 | |

మీ దగ్గరి బుక్ స్టాల్స్ లో
అడగండి. లేకపోతే అడ్వాన్స్
పంపిన V.P.P.లో పంపగలము.

నవభారత్ బుక్ హౌస్
ఏలూరు రోడ్
విజయవాడ-2


## మల్లెల మాసం

"మీరంటే నా కిష్టం. అయి లైక్ యూ. అయి లవ్ యూ! ఏదో దైవ వశాన ఇది తప్పక పోతుందా మీరు నాకు లభ్యమవకపోతారా అన్న ఆశ! మీరు బాధపడితే నన్ను క్షమించండి" అంటూనే వెళ్ళిపోయాడు గదిలోంచి.

వెడుతున్న అతని వంకే చూస్తుండిపోయింది పల్లవి.

పదిరోజులయినా పల్లవి సుధీర్ కి కబురంపక పోవడంతో కృష్ణమోహన్ వచ్చి ఒకరోజు "ఇంకో అయిదు నిముషాలలో సుధీర్ వస్తాడు. నువ్వు ఆలస్యం చేస్తున్నావని నేనే కబురంపాను" అన్నారు.

సుధీర్ వస్తూనే "కంగ్రాట్స్ మిస్ పల్లవీ. అయామ్ సారీ 'మిస్' అనకూడదేమో!" అన్నాడు.

"అదేమిటలా మాట్లాడుతున్నావు" అంది పల్లవి తెల్లబోతూ.

"అవును ఊరంతా అనుకుంటున్నారు, మీ ఇంట్లో ఉండే కుర్రాడితో నీ పెళ్ళి అయిపోయిందని లేక అవబోతోందని"

"నమ్మావా ?" అంది అయోమయంగా.

"నమ్మక ?" అంటూనే బ్రీఫ్ కేసులోంచి కవరు, అందులోంచి ఫొటోలు తీసి ఆమె వడిలో వడేశాడు.

"నమ్ముతున్నావా ?" అంది మళ్ళీ పల్లవి.

"అన్నీ గాఢ పరిష్వంగనాలే. నమ్మక ఏం చేయాలో నాకు తెలియదు."

"అవి అనుకోకుండా జరిగినవని గ్రహిస్తారను కున్నాను సుధీర్" ఆమె కళ్ళలో నీళ్ళు తిరిగాయి.

"అలా అని అనుకోవాలని నీ ఉద్దేశం. పల్లవీ, నువ్వే చూడు, అన్నిటిలోను నీ కళ్ళు మూసుకుని తన్మయత్వంలో ఉన్నట్టు లేవూ ? నీ పరువు మీదికి వచ్చే ధైర్యం ఎవరికుంటుంది నీకు కాబోయే భర్తకి కాక నీకు భర్తయిన వాడికి తప్ప! ఈ కొబ్బరి చెట్ల మధ్య కౌగిలింత, ఈ గుడి దగ్గర నీ పమిట అతని చేతుల్లో— పల్లవీ ఇన్ని చూసి నన్ను నేను ఆత్మవంచన చేసుకోలేను."

"ఏమని ఆత్మ వంచన ?"

"నువ్వు ఆ కుర్రాడిని ప్రేమించడం లేదని, అతనితో తిరగలేదని ఎన్నిసార్లు నచ్చచెప్పుకుందా మన్నా మనస్సంగీకరించడంలేదు పల్లవీ! నేను పవిత్రంగా ఉన్న మగాడిని. నేను ఆశించేది నాకు పవిత్రంగా ఉన్న ఆడది భార్య కావాలని."

"సుధీర్... స్టాపిట్. నీ హద్దు దాటుతున్నావు. ఇక్కడ పవిత్రత చెడిన ఆడవాళ్ళెవరూ లేరు. దేముడు నిజంగా నాయందున్నాడు. నీ నిజమయిన రూపం ముందే తెలిపాడు. ఇదే పెళ్ళయాక ఎవరయినా నా ఫొటో ఒకటి తీసుకువస్తే వదిలి వెళ్ళిపోయేవాడివి. నమస్కారం పెద్ద నమస్కారం ఇక వెళ్ళిపో. నీ 'పవిత్రత'తో నన్ను విసిగించకు. ప్లీజ్" అంటూనే అతను వెళ్ళాడో లేదో చూడనయినా చూడకుండా 'ఇంటర్ కాం' లో "డాడీని, పవన్ ని రమ్మను" అంది పల్లవి.

వస్తూనే "అంతా విన్నాను బేబీ. గెలుపు నాదే!" అన్నారు కృష్ణమోహన్.

"ఆగండి డాడీ, నేను ఓడిపోయానని ఒప్పు కుంటాను. అందువల్లనే ఈ అతి పవిత్రుడ్ని వదిలేశాను. అయితే నా తరువాతి స్టెప్ వేయాలి. మీరు కాసేపు మాట్లాడకూడదు డాడీ ప్లీజ్" అని పవన్ వైపు తిరిగి "సూటిగా అడుగుతున్నాను మిస్టర్ పవన్, 'ఐ లైక్ యూ, ఐ లవ్ యూ' అన్నారు కదు మీరు" అంది.

"కరెక్ట్. ఇప్పటికీ అంటున్నాను" అన్నాడతను.

"బేబీ" అరిచారు కృష్ణమోహన్.

"మాట్లాడకండి డాడీ; ఇది నా జీవితం గురించి! ... మిస్టర్ పవన్, ఆ ఫొటోలలో మీతో అలా ఉండడం వల్లనే నా శీలం చెడిపోయిందను కుంటున్నాడు ఈ ప్రబుద్ధుడు.

అయితే, అతనూ నేనూ అయిదు సంవత్సరాల పాటు, కలిసి తిరిగాం. ఎంతగానో ప్రేమించు కున్నాం, అర్థం చేసుకున్నాం అనుకున్నాను నేను! మరి ... మరి మీకు నా శీలంమీద నమ్మకం ఉందా ?"

"నాకు దృఢమయిన నమ్మకాలున్నాయి మిస్ పల్లవీ, మొదటిది ఒక సంస్కారంగల, ఆత్మాభిమానం గల యువతి ఎప్పుడూ తప్పటడుగు వేయదు. హద్దుమీరి అవతలి వారికి లోకువయిపోదు.

మీరడిగిన ప్రశ్నకి ఇదే నా సమాధానం.

"మరి నన్ను గురించీ ఒక్కమాట చెప్పాలి కద. మనదేశంలో ఆడదానికొక నీతి మగవాడికొక నీతి ఉండడం మన దౌర్భాగ్యం. మగవాడు తప్పులు చేసినా 'మగమహారాజు' అని ఈ ఆడవాళ్ళే క్షమిస్తారు. నాకు అది అసహ్యం. న్యాయం, నీతి అన్నవి ఇద్దరికీ ఒక్కలాగానే ఉండాలి.

మీ పవిత్రతని మనస్ఫూర్తిగా నమ్ముతున్నాను. అలాగే నేనూ అటువంటి వాడినే అని ధైర్యంగా చెబుతున్నాను. నేను 'చనువు'గా ఉన్న మొట్ట మొదటి ఆడపిల్ల మీరే!

మీరు నన్ను చేసుకునేందుకు అంగీకరిస్తే అది నా అదృష్టంగా భావిస్తాను" అన్నాడు పవన్ కుమార్.

"బేబీ, ఏమిటిదంతా — స్టాప్ దిస్ నాన్సెన్స్. నీ లెవల్ ఏమిటి, నీకు వీనెటువంటి సంబంధాలు తెస్తానో చూడు" అడ్డం పడబోయారు కృష్ణ మోహన్.

డాడీ, నేను ఓడిపోయానని ఇందాకనే చెప్పాను. అయితే మీరు గెలవలేదు. నేను పవన్ ని చేసుకుంటాను. ఏడు అడుగులే కాదు, చాలా అడుగులు అతనితో కలిసి నడిచాను" అంది పల్లవి.

"థాంక్స్ పల్లవీ, ఇంకో విషయం కూడా చెప్పాలి. మీ నాన్నగారు ఆర్నెలలు తాను చెప్పిన పనులు ఎదురు చెప్పకుండా చేస్తే నాకు మంచి ఉద్యోగం ఇస్తానన్నారు. నేను "మీరు ఇవ్వద్దు. బయట ఎక్కడయినా ఇప్పించండి' అన్నాను.

ఇదిగో ఈ రోజే మా అగ్రిమెంట్ ప్రకారం ఇప్పించారు. కనుక గౌరవంగా బ్రతికేందుకు నాకు ఆదాయం ఉంది. నిన్ను పోషించగలనన్న ధైర్యమూ ఉంది. వస్తావా మరి నాతో ?"

"వస్తాను పదండి" అంది పల్లవి అతని చేయిపుచ్చుకొని.

★